సాక్షి
డా. బి ఆర్ అంబేద్కర్ కోనసీమ
మంగళవారం । 17 । అక్టోబర్ । 2023



వైనతేయ నదిలో మునిగి బాలుడి గల్లంతు

10లో

వైనతేయ నదీ పాయలో స్నానం చేస్తూండగా ఒక బాలుడు గల్లంతయ్యారు. మరో బాలుడిని బంధువు రక్షించారు.



ఉన్నత విద్యారంగం అభివృద్ధికి ప్రత్యేక విజన్

10లో

ఉన్నత విద్య అభివృద్ధికి సీఎం జగన్ ప్రత్యేక విజన్‌తో సాగుతున్నారని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి అన్నారు.

మిగులు జలాల విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం 17,589 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. అలాగే తూర్పు డెల్టాకు 4,900, మధ్య డెల్టాకు 2,500, పశ్చిమ డెలాక్టు 7 వేల క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేశారు. భద్రాచలం వద్ద 10.40, కాటన్ బ్యారేజీ వద్ద 10.90 అడుగులకు నీటిమట్టం చేరింది.

న్యూస్‌రీల్

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల తనిఖీ



ఓటింగ్ యంత్రాలు భద్రపరచిన గోదాములను పరిశీలిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

ముమ్మిడివరం: స్థానిక ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాల మూడో అంతస్తులో భద్రపరచిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను సోమవారం కలెక్టర్ హిమాన్షు శుక్లా తనిఖీ చేశారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ నాయకుల సమక్షంలో జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్, డీఆర్వో సీహెచ్ సత్తిబాబుతో కలసి గోదాముల సీళ్లు, పరిశీలించి తాళాలు తీశారు. అనంతరం భారత్ ఎలక్ట్రికల్ లిమిటెడ్‌కు చెందిన 12 మంది ఇంజినీర్లు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలైన కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాట్లను అనుసంధానించి ప్రాథమిక స్థాయి తనిఖీ నిర్వహించారు. బ్యాలెట్ యూనిట్‌లో 16 స్థానాల ఓట్ల నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ ప్రక్రియ నవంబరు 10 వరకూ అత్యంత పారదర్శకంగా గుర్తింపు పొందిన రాజకీయ ప్రతినిధుల సమక్షంలో జరుగుతుందని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు.

'జగనన్నకు చెబుదాం'కు 25 అర్జీలు



అర్జీదారులు అందించిన అర్జీని పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీధర్

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 25 అర్జీలు వచ్చాయి. జిల్లా ఎస్పీ శ్రీధర్, ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పి.గన్నవరం మండలం ముంగండ శివారు పెచ్చెట్టివారిపాలెంలో ఆంజనేయస్వామి విగ్రహాన్ని ధ్వంసం చేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలను అడ్డుకోవాలని ఆ గ్రామానికి చెందిన కొందరు జిల్లా ఎస్పీని కలసి ఫిర్యాదు చేశారు. ఇతర మతస్తులు ఈ పని చేస్తున్నారని, మత కలహాలు రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. మండలానికి చెందిన ఓ అధికారి పేరు చెప్పి ఆయన అండదండలు ఉన్నాయమని తమను బెదిరిస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఎస్పీ పి.గన్నవరం పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తగిన ఆదేశాలు ఇచ్చారు. వచ్చిన 25 అర్జీల్లో సగానికి పైగా ఆస్తి తగాదాలు, కుటుంబ వివాదాలు ఉన్నాయి. ఎస్పీ కార్యాలయ సీఐ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు 17ఏ వర్తించదు



జిన్నూరి రామారావు (బాబి)

సాక్షి అమలాపురం: స్కిల్ స్కామ్‌లో ఇరుక్కున మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి 17ఏ వర్తిస్తోందని చెప్పడం సమంజసం కాదని ఏపీ స్టేట్ అగ్రికల్చర్ మిషన్ సభ్యుడు జిన్నూరి రామారావు (బాబి) అన్నారు. సోమవారం అమలాపురంలో ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 17ఏ యాక్టు నవంబరు 2018లో వచ్చిందని గుర్తు చేశారు. స్కిల్ స్కామ్ విషయాన్ని 2017లోనే పూణేకు చెందిన జీఎస్టీ డీజీ వెలుగులోకి తెచ్చారని, ఫేక్ ఇన్వాయిస్‌లతో స్కామ్ చేశారని వారు రాష్ట్ర ప్రభుత్వానికి 2018 ఫిబ్రవరి 28న లేఖ రాశారన్నారు. ప్రజల సొమ్ము పక్కదారి పట్టిన సమయంలో నాడు సీఎంగా ఉన్న చంద్రబాబు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారన్నారు. టీడీపీ నేతలు మాత్రం 2021లో స్కిల్ స్కామ్‌లో ఎఫ్ఐఆర్ వేసినందున 17ఏ వర్తిస్తోందని చెబుతున్నారన్నారు. ఈ యాక్టు అధికారంలో ఉన్నప్పుడు చట్ట ప్రకారం తీసుకున్న చర్యలకు మాత్రమే వర్తిస్తోందని గుర్తించాలన్నారు. అధికార దుర్వినియోగానికి పాల్పడితే వర్తించదన్నారు.

రేపటి నుంచి రైళ్ల పునరుద్ధరణ

కాకినాడ: ట్రాక్ మరమ్మతుల దృష్ట్యా కొద్ది నెలలుగా నిలిచిపోయిన వివిధ రైళ్లను పునరుద్ధరించేందుకు అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ట్రాక్ మరమ్మతులతో విజయవాడ – విశాఖపట్నం మధ్య కొద్ది నెలలుగా రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. ప్రజలు అవస్థలు పడ్డారు. ఎంపీ వంగా గీత ఈ ఇబ్బందులను రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్, డీఆర్ఎం, సీనియర్ డీసీఎం వంటి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో నిలిపివేసిన గుంటూరు–విశాఖపట్నం–గుంటూరు సింహాద్రి, విశాఖపట్నం – లింగంపల్లి – విశాఖపట్నం జన్మభూమి, ఫాస్ట్ ప్యాసింజర్, మచిలీపట్నం–విశాఖపట్నం రైళ్లను బుధవారం నుంచి పునరుద్ధరించనున్నారు.

కంటికి రెప్పలా..

- 'జగనన్న ఆరోగ్య సురక్ష'కు నేత్ర బాధితులే అధికం
- జిల్లాలో 23,852 మందికి పరీక్షలు
- క్యాటరాక్ట్ శస్త్రచికిత్సలకు సిఫార్సు

సాక్షి, అమలాపురం: కంటి చూపు మసకబారితే చాలు అదో ఆందోళన.. సమీపంలోని ఉన్న పట్టణానికి పోవాలి. వైద్యుడిని సంప్రదించేందుకు ఓపీ చార్జీ రూ.300 నుంచి రూ.500 పుచ్చుకోవాలి. కళ్లజోడు పడితే మరో రూ.500 నుంచి రూ.1,500 వరకూ సమర్పించాలి.. ఇక క్యాటరాక్ట్ చికిత్స చేయించుకోవాల్సి వస్తే రూ.15 వేల నుంచి రూ.30 వేల వరకూ వెచ్చించాలి. ఉన్నత వర్గాలకు ఇది పెద్దగా ఇబ్బంది కాదు కానీ పేద, సామాన్యులకే కాదు ఈ ఖర్చు మధ్య తరగతి వారికి సైతం భారంగా మారుతోంది. ఇదంతా ఒకప్పుడు. జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ఆరంభం కావడంతో పాటు, వైద్య శిబిరాలు మొదలైన తరువాత పరిస్థితి మారింది. సామాన్యులతో పాటు పేదలకు సొంతూరులోనే కంటి చూపునకు మెరుగైన వైద్యం అందుతోంది.

జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు గత నెల 30వ తేదీ నుంచి ఆరంభమయ్యాయి. అర్బన్ హెల్త్ క్లినిక్ (యూహెచ్‌సీ)లు, గ్రామాల్లో విలేజ్ హెల్త్ క్లినిక్ (వీహెచ్‌సీ)ల ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల ప్రారంభానికి ముందు ఏఎన్‌ఎంలు, సీహెచ్‌ఓలు విస్తృతంగా సర్వే చేపట్టిన విషయం తెలిసిందే. ఈ సర్వేలో గుర్తించిన రోగులకు ఇప్పుడు నిర్వహిస్తున్న శిబిరాల్లో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 100 మంది నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో శిబిరాలు జరుగుతున్నాయి. ప్రతి శిబిరానికి ఐదుగురు వైద్యులు హాజరవుతున్నారు. ఇందులో అప్తమాలజిస్టులు సుమారు 12 మంది వరకూ ఉంటున్నారు. వస్తున్న రోగులలో మధుమేహం, రక్తపోటు, వైరల్ జ్వరాల బాధితులతో పాటు కంటి సమస్యలతో సతమతమవుతున్న వారూ అధికంగా ఉంటున్నారు.

ఇప్పటి వరకూ 325 శిబిరాలు

ఇప్పటి వరకూ జిల్లాలో 325 వైద్య శిబిరాలు నిర్వహించగా సుమారు 95 వేల మందికి వైద్య పరీక్షలు నిర్వహించారని అంచనా. ప్రతి శిబిరం వద్ద ఒక అప్తమాలజిస్టుతో పాటు శస్త్రచికిత్స నిపుణులు, సిబ్బంది వైద్య సేవలందిస్తున్నారు. వీరు రోగులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. అమలాపురం ఏరియా ఆస్పత్రి కంటి వైద్య నిపుణులు ఈ శిబిరాల ద్వారా ఎక్కువగా సేవలందిస్తున్నారు. ఈ శిబిరాలలో 23,852 మందికి కంటి పరీక్షలు చేయడం గమనార్హం. ఒక్కో శిబిరానికి 125 నుంచి 170 మంది వరకూ కంటి పరీక్షల కోసం వస్తున్నారు. ఈ పరీక్షలు చేయించుకున్న వారిలో 6,922 మంది సాధారణ మందులు పొందినవారు కాగా, 15,669 మందికి కళ్లజోళ్లు వేయాలని వైద్యులు సిఫార్సు చేశారు. 1,234 మందికి కంటి సమస్యలను గుర్తించి ఉన్నత వైద్యం కోసం సిఫార్సు చేయగా, క్యాటరాక్ట్ శస్త్రచికిత్సలకు 1,070 మందిని గుర్తించారు.



అమలాపురం మండలం జనుపల్లిలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

ఎప్పటి నుంచో 'కంటి వెలుగు'

పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రభుత్వం గతంలోనే జగనన్న కంటి వెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమంలో 60 ఏళ్లకు పైబడిన వృద్ధులకు మాత్రమే ఉచిత పరీక్షలు నిర్వహించి కళ్లజోళ్లు అందజేయడంతో పాటు శస్త్రచికిత్సకు ఎంపిక చేసేవారు. వీరికి స్థానిక సచివాలయాల వద్ద శిబిరాలు నిర్వహించేవారు. కానీ ఇప్పుడు జగనన్న సురక్ష వైద్య శిబిరంలో చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు పరీక్షలు చేయించుకుంటున్నారు. శిబిరాలకు పెద్దఎత్తున కంటి సమస్యలతో ఇబ్బంది పడుతున్న వారు వస్తుండడంతో కొన్నిచోట్ల రాత్రి పది గంటల వరకూ పరీక్షలు నిర్వహిస్తుండడం విశేషం.

జిల్లాలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు	:432
జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు	:325
కంటి పరీక్షలు	:23,852
సాధారణ మందులు పొందినవారు	:6,922
కళ్లజోళ్లకు సిఫార్సు	:15,669
ఉన్నత వైద్యం కోసం	:1,234
క్యాటరాక్ట్ శస్త్రచికిత్సలకు	:1,070

పేదలు, సామాన్యులకు మేలు

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లజోళ్లు త్వరలోనే అందించనున్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా నేత్ర శస్త్రచికిత్సలు నిర్వహించనున్నారు. దీని వల్ల పేదలు, సామాన్యులు ఎక్కువగా లబ్ధి పొందనున్నారు. జిల్లాలో వైద్య సేవలు పొందిన వారిలో మహిళలు అధికంగా ఉండడం గమనార్హం. పురుషులు 8,457 మంది, మహిళలు 15,350 మంది వరకూ ఉన్నారు.

సొంతూరులోనే పరీక్షలు



మాకు సొంతూరులోనే కంటి వైద్య పరీక్షలు చేశారు. గతంలో ఇటు రావులపాలెం, అటు రాజమహేంద్రవరం గాని వెళ్లాల్సి వచ్చేది. చాలా ఖర్చు అయ్యేది. ఇప్పుడు మా ఊరు, మా సచివాలయం వద్ద వైద్య పరీక్షలు చేయడం చాలా సంతోషంగా ఉంది. –**బొక్కా మధులత,** నార్కెడ్‌మిల్లి, ఆత్రేయపురం మండలం

ఆ బాధితులే అధికం



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు పెద్ద ఎత్తున రోగులు వస్తున్నారు. ఇందులో కంటి సమస్యలతో బాధపడుతున్న వారు అధికంగా ఉంటున్నారు. వీరికి నిపుణులైన వైద్యులతో పరీక్షలు నిర్వహిస్తున్నాం. అవసరమైన వారికి కళ్లజోళ్లు అందించడంతో పాటు క్యాటరాక్ట్ శస్త్రచికిత్సలకు సిఫార్సు చేస్తున్నాం. – **డాక్టర్ దుర్గారావు దొర,** డీఎంహెచ్‌ఓ

ప్రజలకు ప్రయోజనకరం



గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారుల నుంచి పెద్దల వరకూ కంటి సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. వీరికి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ప్రయోజనకరంగా ఉంటున్నాయి. అమలాపురం మండలంలో 29 సచివాలయాలు ఉండగా, 27 చోట్ల వైద్య శిబిరాలు నిర్వహించనున్నాం. – **డాక్టర్ చరిష్మా,** అమలాపురం ఏరియా ఆసుపత్రి అప్తమాలజిస్టు

చిన్నారి వైద్యానికి తక్షణ సాయం



క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న చిన్నారి నవ్యకు చెక్కు అందిస్తున్న మంత్రి విశ్వరూప్

ఉప్పలగుప్తం: మండలంలోని ఎస్.యానం గ్రామానికి చెందిన చిన్నారి పినిశెట్టి మాధురి నవ్యకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆర్థిక చేయూత అందింది. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ సహకారంతో అది సాధ్యమైంది. కొంత కాలంగా బోన్ క్యాన్సర్‌తో నవ్య బాధపడుతోంది. ఈ విషయాన్ని స్థానిక నాయకులు మంత్రి విశ్వరూప్ దృష్టికి తీసుకువచ్చారు. చిన్నారి ఆర్థిక పరిస్థితి ఇబ్బందిగా ఉండటంతో ఈ నెల 11న కాకినాడ జిల్లా సామర్లకోటకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి సమస్యను మంత్రి విశ్వరూప్ తీసుకు వెళ్లారు. వెంటనే స్పందించిన సీఎం జగన్ తక్షణ సాయంగా రూ.లక్ష అందించి, వైద్యం నిమిత్తం పూర్తి బాధ్యత వహించి చిన్నారికి చికిత్స అందిస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ ప్రకారం సోమవారం మంత్రి విశ్వరూప్ క్యాంపు కార్యాలయంలో చిన్నారికి రూ.లక్ష చెక్కును అందించారు. తమ కుమార్తె ఆరోగ్యంపై వెంటనే స్పందించిన సీఎం జగన్, మంత్రి విశ్వరూప్‌లకు నవ్య తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు, నాయకులు పొగాకు శ్రీను, ఆకుల పద్దయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

ఏలేశ్వరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని కాకర అశిక రాష్ట్ర స్థాయి అండర్–17 కబడ్డీ పోటీలకు ఎంపికైంది. కళాశాలలో అధ్యాపకులతో కలిసి ప్రిన్సిపాల్ కె.బాబ్జీ ఆమెను సోమవారం అభినందించి, ఎంపిక పత్రం అందజేశారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న అశిక చిత్తూరులో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికైంది.

ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా 'జగనన్న ఆరోగ్య సురక్ష'



నడిపూడిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రారంభిస్తున్న మంత్రి విశ్వరూప్

మంత్రి పినిపే విశ్వరూప్

అమలాపురం రూరల్: ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. సోమవారం అమలాపురం రూరల్ నడిపూడి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అనేక సంక్షేమ పథకాలతో పేదలకు ఆసరాగా నిలిచిందన్నారు. తాజాగా ప్రజల కోసం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. 45 రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య సమస్యలు ఉన్నవారిని గుర్తించి ఆయా గ్రామాల్లో సురక్ష వైద్య శిబిరాల ద్వారా సేవలు అందిస్తారన్నారు. అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా వైద్యం చేయిస్తున్నామన్నారు. అనంతరం వృద్ధులకు కళ్లజోళ్లను ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు చేతులమీదుగా పంపిణీ చేశారు. ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ పందిరి హరి, సర్పంచ్ చెల్లు బోయిన వెంకటేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ బొక్కా ఆదినారాయణ, ఎంపీడీఓ జె.వెంకటేశ్వరరావు, కార్యదర్శి అనంతలక్ష్మి, వైద్యులు వాసునాయక్, స్వర్ణకమల, ములపర్తి శాంతిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

కలెక్టర్ హిమాన్షు శుక్లా



బాల్య వివాహాల నివారణపై ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, జేసీ నుపూర్ అజయ్ తదితరులు

అమలాపురం రూరల్: బాల్య వివాహాలతో అనేక అనర్థాలు జరుగుతాయని, వీటిని ప్రోత్సహిస్తే పోక్సో చట్టం ప్రకారం శిక్ష తప్పదని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ గోదావరి భవన్‌లో 'బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో నా వంతు బాధ్యత'పై అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ బాల్య వివాహాల రహిత ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దే విధంగా ప్రతిజ్ఞ చేయించాలని ఆదేశించిందన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం ద్వారా బాల్య వివాహాలను అరికట్ట వేయవచ్చని అన్నారు. 18 ఏళ్ల కంటే తక్కువ వయసున్న బాలికను వివాహం చేసుకుంటే బాల్య వివాహ చట్ట ప్రకారం శిక్షార్హులన్నారు. బాల్య వివాహం చేస్తే వరుడు, వధువు తల్లిదండ్రులకు, బంధువులకు కూడా శిక్ష పడుతుందన్నారు. మెరుగైన సమాజ నిర్మాణంలో అంతా భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో జేసీ నుపూర్ అజయ్, సీపీఓ వెంకటేశ్వర్లు, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకర్‌ప్రసాద్, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, పంచాయతీరాజ్ ఎస్ఈ కె.చంటిబాబు, డీపీఓ వి.కృష్ణకుమారి, జిల్లా వ్యవసాయ అధికారి ఎ.బోసుబాబు, ఏపీఈపీడీఎల్ ఈఈ రవికుమార్ పాల్గొన్నారు.

ప్రతి అర్జీకి పరిష్కారం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి వచ్చే ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులు ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక జరిగింది. అర్జీదారుల నుంచి వివిధ సమస్యలపై 233 అర్జీలను జేసీ ఎస్.నుపూర్ అజయ్‌తో కలసి ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల కేంద్రాల్లో ప్రతి బుధ, శుక్రవారాల్లో షెడ్యూల్ ప్రకారం జరిగే జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమానికి తప్పనిసరిగా జిల్లా స్థాయి అధికారులు హాజరు కావాలన్నారు. స్థానిక సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎం.దుర్గారావుదొర, డీఆర్డీఏ పీడీ శివశంకర్ ప్రసాద్ పాల్గొన్నారు.

అప్పటికప్పుడే..



- రైతుకు దండిగా పంట రుణాలిస్తున్న డీసీసీబీ
- రెండు మూడు రోజుల్లోనే అందజేత
- నెలాఖరు వరకూ మంజూరుకు అవకాశం

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): సాగుకు శ్రీకారం చుట్టింది మొదలు అన్నదాతకు అడుగడుగునా పెట్టుబడి అవసరమవుతూంటుంది. దుక్కి చేయడం.. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనడం.. కూలీ ఖర్చులు.. ఇలా ప్రతి ఎకరాకు సుమారు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకూ పెట్టుబడి అవుతూంటుంది. పంట పెట్టుబడుల కోసం రైతులు ఒకప్పుడు ప్రైవేటు వ్యాపారుల వద్ద అప్పులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉండేది. ఫలితంగా ఆరుగాలం పడిన శ్రమ తప్ప.. వారి చేతికి వచ్చే లాభం పెద్దగా ఉండేది కాదు. వచ్చిన మిగులు ఏదైనా ఉంటే.. అదంతా ఆయా ప్రైవేటు వ్యాపారుల వద్ద తెచ్చిన రుణాలకు చెల్లించాల్సిన వడ్డీకే సరిపోయేది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత అన్నదాతలకు ఈ బాధలు తప్పాయి. తీసుకున్న పంట రుణం సకాలంలో చెల్లించిన రైతులపై వడ్డీ భారం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. జిల్లా కేంద్ర సహకార బ్యాంకులతో పాటు వాణిజ్య బ్యాంకుల నుంచి కూడా రైతులకు రుణాలు అందుబాటులోకి తీసుకువస్తోంది. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా రైతులకు దండిగా రుణాలు అందిస్తోంది. అవసరమైన ప్రతి రైతుకూ పంట రుణాలు అందించడమే లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుత ఖరీఫ్‌లో రూ.780 కోట్ల మేర పంట రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా.. ఇప్పటి వరకూ రూ.365 కోట్లు పంపిణీ చేసింది. ఉమ్మడి జిల్లాలోని 50 డీసీసీబీ బ్రాంచిలు, 300 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా 2.10 లక్షల మంది రైతులు పంట రుణాలు పొందారు.

రైతులకు డీసీసీబీ ఖరీఫ్ పంట రుణాలిచ్చిందిలా..

లక్ష్యం	:రూ.780 కోట్లు
ఇప్పటి వరకూ ఇచ్చినది	:రూ.365 కోట్లు
రుణాలు పొందిన రైతులు	:2,10,000

వడ్డీ భారం లేకుండా..

పంట రుణాల కోసం వాణిజ్య బ్యాంకులకు వెళ్తే బోలెడు నిబంధనలు పెడతారు. వారం, పది రోజులు ఆయా బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి ఉంటుంది. కానీ డీసీసీబీ ద్వారా రెండు మూడు రోజుల్లోనే రైతులకు కావాల్సిన పంట రుణాలు అందిస్తున్నారు. దీంతో సహకార సంఘాల్లో రుణాలు తీసుకునేందుకు రైతులు ముందుకు వస్తున్నారు. సహకార సంఘాల ద్వారా భూమికి సంబంధించిన పాస్ పుస్తకం ఆధారంగా ఎకరానికి రూ.50 వేల వరకూ పంట రుణాలు అందిస్తున్నారు. ఏటా డీసీసీబీ ద్వారా సుమారు 3 లక్షల మంది పైగా రైతులు పంట రుణాలు పొందుతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి రైతుకూ పంట రుణాలు అందించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంది. పైగా రైతులపై వడ్డీ భారం పడకుండా ప్రభుత్వమే ఆ 7 శాతం వడ్డీని బ్యాంకులకు చెల్లిస్తోంది. తీసుకున్న పంట రుణాలను సంవత్సరంలోగా తిరిగి చెల్లిస్తే రైతులు ఎటువంటి వడ్డీ కట్టాల్సిన అవసరం ఉండదు.

రెండు రోజుల్లోనే..



నాకు సామర్లకోట మండలం పవర గ్రామంలో రెండెకరాలు పంట పొలం ఉంది. పెట్టుబడి సాయం కోసం గ్రామంలోని సహకార సంఘానికి వెళ్తే రూ.లక్ష పంట రుణం ఇస్తానన్నారు. నాకు రూ.70 వేలు సరిపోతుందని చెప్పడంతో రెండు రోజుల్లోనే ఆ రుణం మంజూరు చేశారు. కేవలం పాస్ పుస్తకం తీసుకొని ఈ రుణం మంజూరు చేశారు. – **మండపాక సాగరరావు,** రైతు, చంద్రపాలెం, సామర్లకోట మండలం

ప్రతి రైతుకూ పంట రుణం



అవసరమైన ప్రతి రైతుకూ పంట రుణం ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఈ నెలాఖరు వరకూ పంట రుణాలు ఇస్తాం. పంట రుణాలు అవసరమైన రైతులు సమీపంలోని సహకార సంఘాల్లో సంప్రదించాలి. – **ఆకుల వీర్రాజు,** చైర్మన్, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు, కాకినాడ

రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలకు ఎంపిక



పి.అజయ్



కె.వనజశ్రీ



కె.తేజశ్రీ



డి.శివదుర్గ



బి.భానుశ్రీ

పి.గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఐదుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం డీఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. ఇటీవల జిల్లా స్థాయిలో జరిగిన ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరచడంతో వీరిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు వివరించారు. అండర్–14 బాలుర విభాగ రాష్ట్ర స్థాయి కబడ్డీ, హైజంప్, లాంగ్ జంప్, 100 మీటర్ల పరుగుపందెం పోటీలకు పి.అజయ్, అండర్–17 బాలికల విభాగంలో వాలీబాల్ పోటీలకు కె.వనజశ్రీ, త్రోబాల్ పోటీలకు కె.తేజశ్రీ, సెపక్ తక్రాకు డి.శివదుర్గ, కబడ్డీ పోటీలకు బి.భానుశ్రీ అర్హత సాధించినట్లు వివరించారు. వీరిని హెచ్‌ఎం ప్రసాద్‌తో పాటు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ గూటం శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయులు భీమేంద్ర, సతీష్, దుర్గాప్రసాద్, సుభాషిణి, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

క్లుప్తంగా

ఆరోగ్యానికి 'సురక్ష' ఇది



వెంకట్రావుకు వైద్య సేవలందిస్తున్న వైద్యులు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం ఏకే మల్లవరంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వైద్యులు స్థానికులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. ఇదిలాఉంటే ఆ ప్రాంతానికి చెందిన వెంకట్రావుకు బీపీ తగ్గిపోవడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన చెందడంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఉన్న డాక్టర్ రవికుమార్ హుటాహుటిన అస్వస్థతకు గురైన వ్యక్తి వద్దకు వెళ్లి వైద్య సేవలు అందించారు. దీంతో ఆయన కోలుకోవడంతో కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

భారీగా రేషన్ బియ్యం స్వాధీనం



ఈలకొలనులో అధికారులు సీజ్ చేసిన లారీ

రంగంపేట: పీడీఎస్ బియ్యాన్ని సోమవారం విజిలెన్స్, రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారులు పట్టుకున్నారు. రీజినల్ విజిలెన్స్ ఇన్‌చార్జి ఎస్పీ కె.కుమార్ కథనం ప్రకారం.. రంగంపేట మండలం ఈలకొలను గ్రామ సమీపంలో లారీలో రేషన్ బియ్యం రవాణా జరుగుతున్నట్టు సమాచారం అందడంతో వాహన తనిఖీలు నిర్వహించారు. ఓ లారీని తనిఖీ చేయగా 713 ప్లాస్టిక్ బస్తాల్లో సుమారు 35,660 కిలోల బియ్యాన్ని గుర్తించారు. దీని విలువ రూ. 54,26,400గా నిర్ధారించారు. పీడీఎస్ బియ్యం గుంటూరుకు చెందిన సామ కార్తీక్ ఆదేశాల మేరకు రాజమహేంద్రవరంలోని బుచ్చయ్యనగర్‌కు చెందిన లారీ డ్రైవర్ నల్లశెట్టి మురళీకృష్ణ మచిలీపట్నం నుంచి తరలిస్తున్నట్టు తెలిపారు. బియ్యం రవాణాకు సంబంధించి సరైన బిల్లులు లేనందున సివిల్ సప్లయిస్ అధికారులు లారీని, బియ్యాన్ని సీజ్ చేసి 6ఏ కేసు నమోదు చేసి లారీ డ్రైవర్, బియ్యం యజమాని, సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు కోసం రంగంపేట పోలీసులకు సిఫారసు చేశారు. తనిఖీల్లో కార్యాలయ సబ్‌ఇన్‌స్పెక్టర్ జగన్నాథరెడ్డి, జియాలజిస్టు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

విద్యా వికాసానికి విజ్ఞాన జ్యోతి

- చిన్నారులకు ఉత్తమ బోధన
- మెరుగైన అభ్యసనానికి 'ఎఫ్ఎల్ఎన్'
- ప్రాథమిక, పూర్వ ప్రాథమిక విద్య బలోపేతానికి చర్యలు



శిక్షణలో భాగంగా కృత్యాలు ప్రదర్శిస్తున్న డీఆర్పీలు

రాయవరం: ఒక భవనం నిర్మించేటప్పుడు పునాది బలంగా ఉండాలి. అప్పుడే భవనంపై ఎన్ని అంతస్తులైనా కట్టొచ్చు. ఇదే విధానం విద్యార్థికీ వర్తిస్తోంది. ఒక విద్యార్థికి పూర్వ ప్రాథమిక, ప్రాథమిక స్థాయిలో పునాది బలం ఉంటే అభ్యసనా సామర్థ్యాలను సులభంగా చేరుకుంటాడు. అందుకే ఇప్పుడు ప్రభుత్వం పూర్వ ప్రాథమిక, ప్రాథమిక స్థాయిలో విద్యార్థి అభ్యసనా సామర్థ్యాల పెంపుదలకు ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమాన్ని చేపట్టింది. సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (సాల్ట్)లో భాగంగా ఎన్‌జీవో సంస్థ ప్రథమ్ భాగస్వామ్యంతో ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని పూర్వ, ప్రాథమిక పాఠశాలల్లో అమలుకు పాఠశాల విద్యాశాఖ చర్యలు ప్రారంభించింది.

ఈసీసీఈలో భాగంగా..

నూతన విద్యా విధానం-2020లో భాగంగా ప్రభుత్వం పలు విద్యా సంస్కరణలను ప్రవేశపెట్టింది. నిపుణ్ భారత్ లక్ష్యాలను సాధించే క్రమంలో భాగంగా ఎర్లీ చైల్డ్ సెంటర్ ఎడ్యుకేషన్ (ఈసీసీఈ)ను ప్రవేశపెట్టింది. ఇందులో ప్రీ ప్రైమరీ-1, 2ను అమలు చేస్తున్నారు. ప్రీ ప్రైమరీ-1లో 3-4 ఏళ్ల చిన్నారులకు, ప్రీ ప్రైమరీ-2లో 4-5 ఏళ్ల చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యా బోధన చేస్తారు. ప్రీ ప్రైమరీలోనే పాఠశాల సంసిద్ధతా కార్యక్రమాలను అమలు చేస్తారు. ఐదేళ్లు నిండిన చిన్నారులు ప్రైమరీ తరగతులు నిర్వహిస్తారు. ప్రీ ప్రైమరీ, ప్రైమరీలో 1, 2 తరగతులకు ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా 2026-27 విద్యా సంవత్సరానికి రెండో తరగతి నుంచి మూడో తరగతికి వెళ్లే విద్యార్థులంతా ఆయా తరగతుల అభ్యసనా సామర్థ్యాలను కచ్చితంగా పొందాల్సి ఉంటుంది.

నైపుణ్యాలు సాధించేందుకు..

ప్రతి విద్యార్థి ఆయా తరగతుల అభ్యసనా సామర్థ్యాలను పొందాల్సి ఉంటుంది. అయితే పదో తరగతికి చేరుకుంటున్న విద్యార్థులు తెలుగు, గణితంలో ప్రాథమిక భావనలు ఉండడం లేదన్న కఠోర వాస్తవాలను అసర్, నాస్, శ్లాస్ తదితర నివేదికలు బహిర్గతం చేశాయి. దీంతో ప్రభుత్వం పూర్వ ప్రాథమిక, ప్రాథమిక స్థాయిలో విద్యార్థులు అభ్యసనా సామర్థ్యాలను సాధించేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు చేపడుతుంది. అందులో భాగంగానే ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ కార్యక్రమం చేపట్టింది. పూర్వ ప్రాథమిక, ప్రాథమిక విద్య (1, 2 తరగతులు) పూర్తి చేసి మూడో తరగతిలో చేరే సమయానికి తెలుగులో చదవడం, రాయడం, వినడం, మాట్లాడడం రావాల్సి ఉంటుంది. గణితంలో చతుర్విధ ప్రక్రియలైన కూడికలు, తీసివేతలు, గుణకారం, భాగహారంపై నైపుణ్యాలను సాధించాలి.

డీఆర్పీలకు శిక్షణ పూర్తి

ఎఫ్ఎల్ఎన్ అమల్లో భాగంగా పూర్వ ప్రాథమిక విద్యను జ్ఞాన జ్యోతిగా, ప్రాథమిక విద్యను జ్ఞాన ప్రకాష్‌గా పేర్కొన్నారు. తొలుత ప్రాథమిక విద్యను బోధించే ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు డీఆర్పీలకు శిక్షణ పూర్తి చేశారు. మండలానికి ముగ్గురు ఎస్‌జీటీ ఉపాధ్యాయులను డీఆర్పీలుగా ఎంపిక చేసిన వారికి రెసిడెన్షియల్ విధానంలో శిక్షణనిచ్చారు. ప్రతి జిల్లాలో ఒక్కో మండలం నుంచి ముగ్గురు ఉపాధ్యాయుల చొప్పున శిక్షణ ఇస్తున్నారు. కోనసీమ జిల్లా నుంచి 66 మంది డీఆర్పీలు శిక్షణ పూర్తి చేసుకున్నారు. త్వరలోనే డీఆర్పీలు ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది. ప్రస్తుతం జ్ఞానజ్యోతిలో భాగంగా డీఆర్పీలుగా ఎంపిక చేసిన వారికి కూడా ఆరు రోజుల రెసిడెన్షియల్ శిక్షణ ఇస్తున్నారు. ఈ నెల 9 నుంచి 14వ తేదీ వరకూ విశాఖపట్నంలో మండలానికి ముగ్గురు డీఆర్పీల వంతున మొదటి స్పెల్‌లో 33 మంది శిక్షణ పొందుతుండగా, రెండో స్పెల్‌లో 33 మంది శిక్షణ ఇవ్వనున్నారు.

సమగ్రాభివృద్ధి సాధ్యం



ఎఫ్ఎల్ఎన్ ద్వారా చిన్నారుల సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుంది. మూడు నుంచి ఎనిమిదేళ్ల వయసు వచ్చేసరికి ప్రాథమిక విద్య బలోపేతంలో భాగంగా పునాది విద్యను పటిష్టం చేస్తున్నాం. అంగన్‌వాడీ కార్యకర్తలకు తర్ఫీదు పొందిన డీఆర్పీలు శిక్షణ ఇస్తారు.

–వై.విజయశ్రీ, కీ రీసోర్స్ పర్సన్, సీడీపీఓ, పి.గన్నవరం

ఇదో మంచి కార్యక్రమం



ఎఫ్ఎల్ఎన్‌లో ఇప్పటికే 60 రోజుల శిక్షణలో భాగంగా జిల్లాలో డీఆర్పీలకు శిక్షణ ఇచ్చాం. రెండో దశ 120 రోజుల శిక్షణ పూర్వ ప్రాథమిక, ప్రాథమిక విద్యను బోధించే అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎస్జీటీలకు శిక్షణ ఇచ్చే డీఆర్పీలకు శిక్షణ ఇస్తాం. ఎఫ్ఎల్ఎన్ చాలా మంచి కార్యక్రమం. తప్పనిసరిగా విజయవంతమవుతుంది.

– ఎం.కమలకుమారి, డీఈఓ, అమలాపురం

నేడు 'సంహిత'లో మెగా జాబ్‌మేళా

రావులపాలెం: స్థానిక సంహిత డిగ్రీ కళాశాలలో మంగళవారం రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జి.రాజేంద్రప్రసాద్ సోమవారం తెలిపారు. దీనికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిస్తారన్నారు. ఈ మేళా ద్వారా సుమారు వెయ్యి మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఐటీఐ, డిప్లొమో, బీటెక్ చేసిన వారు హాజరు కావాలన్నారు. జీతం రూ.12 వేల నుంచి రూ.40 వేల వరకూ (ఆయా ఉద్యోగాలను బట్టీ) ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని పరిసర ప్రాంతాల నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నమ్మించి మోసగించిన వ్యక్తి అరెస్ట్

అమలాపురం టౌన్: రెండేళ్లుగా ఓ యువతిని ప్రేమ పేరుతో నమ్మించి మోసం చేయడమే కాకుండా ఆమెపై లైంగిక దాడికి పాల్పడిన కాట్రేనికోన మండలం ఉప్పూడి గ్రామానికి చెందిన సాపే నాగరాజును అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు బాధిత యువతి ఈ నెల 13న నాగరాజుపై ఫిర్యాదు చేసిందన్నారు. కేసును దర్యాప్తు చేసిన ముమ్మిడివరం సీఐ ఎస్.కొండయ్య, కాట్రేనికోన ఎస్సై టి.శ్రీనివాస్ ఇరుపక్షాల సమక్షంలో నాగరాజుకు కౌన్సెలింగ్ ఇచ్చినా పెళ్లికి అంగీకరించకపోవడంతో అతనిపై కేసు నమోదు చేసి ఆదివారం అరెస్ట్ చేశామన్నారు. మేజిస్ట్రేట్ కోర్టు అతనికి రిమాండు విధించడంతో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించామన్నారు.

నారాయణి సిల్క్స్ ప్రారంభం



షోరూమ్‌ను ప్రారంభిస్తున్న శ్రీపీఠం అధిపతి పరిపూర్ణానంద స్వామీజీ



వస్త్రాలను తిలకిస్తున్న సినీ నటి శ్రీలీల

ప్రకాశంనగర్ (రాజమహేంద్రవరం): పట్టుచీరల ప్రాశస్త్యాన్ని మరింత విస్తరించడంలో భాగంగా నారాయణి సిల్క్స్ 8వ షోరూంను రాజమహేంద్రవరంలో సోమవారం ప్రారంభించామని నిర్వాహకులు తెలిపారు. స్థానిక కోటగుమ్మం వద్ద ఏర్పాటు చేసిన ఈ షోరూంను శ్రీపీఠం అధిపతి పరిపూర్ణానంద స్వామి రిబ్బన్ కత్తిరించి ప్రారంభించగా, సినీనటి శ్రీలీల జ్యోతిప్రజ్వలన చేసి పలు వస్త్రాలను తిలకించారు. ఈ సందర్భంగా పరిపూర్ణానంద స్వామీజీ మాట్లాడుతూ సంప్రదాయం, ఆధునికత కలబోసిన కాంచీపురం నారాయణి సిల్క్స్‌ను ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సినీ నటి శ్రీలీల మాట్లాడుతూ దసరా శరన్నవరాత్ర ఉత్సవాల్లో ప్రారంభమైన నారాయణి సిల్క్స్‌లో తెలుగింటి మహిళల అభిరుచులకు తగిన విధంగా అన్నిరకాల పట్టుచీరలు, పురుషులకు సంబంధించిన డి రాయల్ బ్రాండెడ్ దుస్తుల కలెక్షన్లు బాగున్నాయని తెలిపారు. శ్రీలీలను చూసేందుకు అభిమానులు తరలిరావడంతో కోటగుమ్మం ప్రాంతం జనంతో నిండిపోయింది. సంస్థ డైరెక్టర్ పీవీఎస్ అభినయ్ మాట్లాడుతూ షోరూం ప్రారంభోత్సవం సందర్భంగా ప్రతి రూ.15 వేల కొనుగోలుపై 20 గ్రాముల వెండి నాణేం ఉచితంగా అందిస్తున్నామన్నారు. ప్రారంభోత్సవ ఆఫర్లను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంస్థ డైరెక్టర్లు ఎస్.సురేష్, టి.కేశవగుప్తా, టి.రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న సన్నిధిలో అజేయకల్లాం



ప్రభుత్వ ప్రధాన సలహాదారు అజేయ కల్లాంకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి వారిని విశ్రాంత ఐఏఎస్ అధికారి, ప్రభుత్వ ప్రధాన సలహాదారు అజేయ కల్లాం సోమవారం దర్శించుకున్నారు. తొలుత ఆయనకు ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, అర్చకులు స్వాగతం పలికారు. ఆలయంలో స్వామివారిని దర్శించుకున్న కల్లాం తీర్థప్రసాదాలు స్వీకరించారు. స్వామివారి చరిత్రను ఆలయ అర్చకులు వివరించారు. స్వామివారి దర్శనం అనంతరం ఆశీర్వచనం, స్వామివారి చిత్రపటాన్ని అర్చకులు అందజేశారు.

ఉన్నత విద్యారంగం అభివృద్ధికి ప్రత్యేక విజన్

- రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి
- ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డుతో 'నన్నయ' ఒప్పందం



ఆచార్య హేమచంద్రారెడ్డి, వీసీ పద్మరాజు సమక్షంలో ఎంఓయూలను మార్చుకుంటున్న ఆచార్య సుధాకర్, తిరుమల ఆరోహి

రాజానగరం: రాష్ట్రంలో ఉన్నత విద్యా రంగం అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక విజన్‌తో ముందుకు సాగుతున్నారని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య హేమచంద్రారెడ్డి అన్నారు. ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డుతో ఆదికవి నన్నయ యూనివర్సిటీకి కుదిరిన అవగాహన ఒప్పందం (ఎంఓయూ) నేపథ్యంలో స్థానిక యూనివర్సిటీలోని కన్వెన్షన్ హాలులో సోమవారం వర్క్‌షాప్ జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఇంటర్న్‌షిప్‌ల ద్వారా విద్యార్థులకు సరికొత్త అవకాశాలను అందిస్తూ, ఉపాధి, ఉద్యోగావకాశాలను మెరుగుపరుస్తున్నారన్నారు. కోవిడ్ సంక్షోభం తరువాత ఆన్‌లైన్ లెర్నింగ్‌పై ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం జాతీయ విద్యావిధానం 2020 అమలులో దేశంలోనే ముందంజలో ఉందన్నారు. ఇందులో ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. వీసీ ఆచార్య కె.పద్మరాజు మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యను అందించేందుకు చేస్తున్న కృషిలో భాగంగా ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డుతో ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డు ఉపాధ్యక్షులు తిరుమల ఆరోహి మాట్లాడుతూ తమ వద్ద 20 వేల కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇన్ఫోసిస్ సీనియర్ బిజినెస్ మేనేజర్ డాక్టర్ ఎస్.మీనాక్షి, లెర్నింగ్ స్పెషలిస్ట్ కుమారస్వామిలు రిసోర్స్‌పర్సన్లుగా నూతన టెక్నాలజీకి సంబంధించిన వివిధ అంశాలను వివరించారు. అనంతరం రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డు ఉపాధ్యక్షులు తిరుమల ఆరోహిలు ఎంఓయూ పత్రాలపై సంతకాలు చేసి, పరస్పరం మార్చుకున్నారు.

వైనతేయ నదిలో మునిగి బాలుడి గల్లంతు

మరో బాలుడిని రక్షించిన బంధువు



సాయి (ఫైల్)



కె.ఏనుగుపల్లిలో గల్లంతైన బాలుడి కోసం నదిలో గాలింపు చర్యలు

పి.గన్నవరం: దసరా సెలవులకు కె.ఏనుగుపల్లి గ్రామానికి వచ్చిన ఐదుగురు బాలురు సోమవారం సాయంత్రం వైనతేయ నదీపాయలో స్నానం చేస్తుండగా ఒకరు గల్లంతయ్యారు. నీటిలో మునిగిపోతున్న మరో బాలుడిని బంధువు రక్షించారు. పి.గన్నవరం ఎస్సై హరికోటి శాస్త్రి కథనం ప్రకారం.. అమలాపురానికి చెందిన సాధనాల సాయి (15), అతడి తమ్ముడు దుర్గేష్ (9), చిన్నమ్మ కుమారుడు వంగా సాయి (11)లు దసరా సెలవులకు ఆదివారం పి.గన్నవరం మండలం కె.ఏనుగుపల్లి గ్రామంలోని అమ్మమ్మ ఇంటికి వచ్చారు. సాధనాల సాయి మేనమామ అయిన తోలేటి దివాకర్ ఇంటికి.. ఆయన స్నేహితుడైన సత్యనారాయణ చెన్నై నుంచి తన కుమారులు అనిరుథ్ (11), హంక్రిష్ (8)లతో కలసి ఇటీవల వచ్చారు. అయితే సోమవారం సాయంత్రం ఐదుగురు బాలలతో కలసి దివాకర్ అతని స్నేహితుడు సత్యనారాయణ ఇంటి వెనుక ఉన్న వైనతేయ నది వద్దకు వెళ్లారు. దివాకర్, సత్యనారాయణలు గట్టు మీద కూర్చొని ఉండగా, ఐదుగురు పిల్లలు నదిలో స్నానానికి దిగారు. ప్రమాదవశాత్తూ సాధనాల సాయి, అనిరుథ్‌లు నీటిలో మునిగిపోయారు. దీనిని గమనించిన దివాకర్ హుటాహుటిన నదిలోకి దూకి అనిరుథ్‌ను రక్షించారు. కళ్ల ముందే మేనల్లుడు సాయి నీట మునిగి గల్లంతయ్యాడు. సాయి కోసం నదిలో గాలింపు చర్యలు చేపట్టినట్టు ఎస్సై హరికోటిశాస్త్రి తెలిపారు.

విషాదంలో బంధువులు

అమలాపురం వడ్డిగూడెం ప్రాంతానికి చెందిన సాధనాల సాయి గల్లంతుతో రెండు ప్రాంతాల్లోనూ విషాద ఛాయలు అలముకున్నాయి. సాయి తండ్రి ఏసుబాబు సర్కార్యులర్ బజారు వద్ద కూరగాయల షాపు నిర్వహిస్తున్నాడు. తల్లి గృహిణి. వీరికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడైన సాయి నదిలో స్నానం చేస్తూ గల్లంతు కావడంతో తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు.